క్లుప్తంగా

భక్తులకు మజ్జిగ పంపిణీ



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో వేసవి తీవ్రత దృష్ట్యా ఆదివారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈమజ్జిగ పంపిణీని హైదరాబాద్, కూకట్‌పల్లికి చెందిన పెందుర్తి మధుకల్యాణ్ సౌజన్యంతో ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపై కల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి విశేష పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సుదర్శన హోమం నిర్వహించారు. వేప, రావి చెట్ల వద్ద లక్ష్మీనారాయణ కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. అనంతరం స్వామివారిని శేష వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. సెలవు దినం కావటంతో పాటు ఇంటర్, పదో తరగతి పరీక్షలు పూర్తవటం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్రా, తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

నేడు'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంచికచర్ల : 'స్పందన' కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం అర్జీలు దాఖలు చేయాలని కోరారు. ఆ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

వీరులపాడు(కంచికచర్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఆశియానాయక్ ఆదివారం తెలిపారు. మండలంలోని గ్రామాల్లో సమస్యలు ఉంటే ప్రజలు స్పందలో తెలియజేయాలని కోరారు. త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

ప్రచారభేరి పోస్టర్ల ఆవిష్కరణ



తిరువూరు: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వంపై వామపక్షాలు ఉమ్మడి పోరాటం చేస్తాయని సీపీఐ సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య అన్నారు. తిరువూరు సీపీఐ కార్యాలయంలో ఆదివారం మోదీ హటావో – దేశ్ కీ బచావో కార్యక్రమ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పేదవర్గాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మిర్చి రైతుల ఆనందం

- ఆశాజనకంగా మిర్చి ధర
- క్వింటా మిర్చి రూ.20 వేల పైనే..
- ఎకరాకు 10 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి..
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కీసరలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి

కంచికచర్ల: ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మిర్చి పంటను సాగుచేసిన రైతులు ఖుషీ ఖుషీగా ఉన్నారు. మిర్చికి మార్కెట్‌లో మంచి ధర ఉంది. ప్రస్తుతం ఎండు మిర్చి ధర మార్కెట్‌లో క్వింటా రూ.20 వేలకు పైగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.18 వేలకు పలికిన ధర, ఈ రెండురోజుల్లో ధర ఘాటెక్కింది. ప్రస్తుతం మూడు నాలుగు కోతల కాయలు కిలో రూ.250 వంతున గ్రామాల్లో రైతులు విక్రయించారు.

సీజన్ కావడంతో..

మార్చి, ఏప్రిల్ నెలలో ఎండు మిర్చి సీజన్ మొదలవుతోంది. అయితే కంచికచర్ల మండలం మోగులూరు, గనిఆత్కూరు, కీసర తదితర గ్రామాలకు వచ్చి ప్రజలు ఎండు మిరపకాయలను కొనుగోలు చేస్తుంటారు. ఈ గ్రామాల్లో పండించిన మిర్చి దేశవాళీ కావటంతో నాణ్యత, రుచి ఉంటుందని ప్రజల నమ్మకం. ఈ గ్రామాల్లో సాగుచేసిన మిరపకాయలతో తయారు చేసిన కారంతో పచ్చళ్లు పెడితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందని మహిళలు అంటున్నారు. ఈ ప్రాంత వాసులు కూడా స్థానికంగా లభించే మిర్చిని కొనుగోలు చేసి దూర ప్రాంతాల్లోని బంధువులకు వేసవి కానుకగా పంపిస్తారు.

5,265 ఎకరాల్లో సాగు..

నందిగామ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రైతులు 5,265 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారని నందిగామ వ్యవసాయ సంచాలకులు ధర్మపురి రమణమూర్తి తెలిపారు. కంచికచర్ల మండలంలో 431 ఎకరాలు, నందిగామ మండలంలో 1,025 ఎకరాలు, చందర్లపాడు మండలంలో 3,110 ఎకరాలు, వీరులపాడు మండలంలో 699 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగుచేశారు. మిర్చి పంటను ఎక్కువగా చందర్లపాడు మండలం రైతులు సాగుచేస్తారు. మండలంలోని గ్రామాలన్నీ కృష్ణానదికి ఆనుకుని ఉండటంతోపాటు నీటి వనరుల లభ్యత బాగా ఉంటుంది.

ఆశించిన మేరకు దిగుబడి..

నాణ్యమైన విత్తనాలు నాటితే రైతులు ఆశించిన మేరకు ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. చందర్లపాడు మండలంలో 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. అయితే మిర్చి పంటకు చీడపీడలు ఆశిస్తే 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చిందని కొంత మంది రైతులు తెలిపారు. ఎకరాకు మిర్చి పంట సాగుకు రూ.70 వేల 90 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అయ్యాయని రైతులు అంటున్నారు.

మార్కెట్‌లో మంచి ధర..



ఈ ఏడాది మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. రైతులు ఆశించిన మేరకు దిగుబడులు బాగా వచ్చాయి. చీడపీడలు ఆశించిన మిర్చి పంటలకు తక్కువ దిగుబడులు వచ్చాయి. క్వింటాల్ ధర మార్కెట్‌లో రూ.20 వేలు పలుకుతోంది. ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకుండా ఉంటే మంచి దిగుబడులు వస్తాయి.

–కే విజయకుమార్, ఎంఏవో, కంచికచర్ల

యువతకు కందుకూరి స్ఫూర్తి కావాలి



జగ్గయ్యపేట అర్బన్: సామాజిక దురాచారాలపై కందుకూరి వీరేశలింగం పంతులు అలుపెరుగని పోరాటం చేశారని, నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కవి రత్న దోసపాటి నాగేశ్వరరావు అన్నారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం స్థానిక జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కవి దోసపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటి సామాజిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి సంఘంలో సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషి చేశారని తెలిపారు. స్త్రీ పునర్వివాహాలను జరిపించారని, బాలికలకు ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పారని తెలిపారు. గ్రంథాలయంలో చదువుకుంటూ ఎండోమెంట్‌లో ఈవోగా ఉద్యోగం సంపాదించిన కటికల నివేదితను ఘనంగా సన్మానించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రాజశేఖర్, విజయ్, సతీష్, రాము, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్సీ అరుణకుమార్



కానిస్టేబుల్‌గా ఎంపికైన యువతికి మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆత్మగౌరవంతో.. స్వీయ నిర్ణయాలు తీసుకుంటూ నందిగామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ సెంటరులో బహుజన్ సేవా సమితి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి అరుణకుమార్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే తాను, శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నియోజకవర్గ అభివృద్ధితో పాటు బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ చూపిన బాటలో నడుచుకుంటూ బహుజనులు ఉన్నత స్థాయికి చేరాలని ఆయన సూచించారు. గత ప్రజా ప్రతినిధుల మాదిరిగా పక్క నియోజకవర్గ నేతల చేతిలో కీలు బొమ్మగా మారకుండా స్వీయ నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు.

కాన్షీరాం విగ్రహం ఏర్పాటుకు చర్యలు..

నందిగామ పట్టణంలో కాన్షీరాం విగ్రహం ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామని అరుణ కుమార్ తెలిపారు. ముందుగా అంబేడ్కర్ పేరుతో రచించిన 'కుల నిర్మూలన' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ కానిస్టేబుల్ ట్రెనింగ్‌కు ఎంపికైన ముగ్గురు యువతులకు పత్తిపాటి కుమార్ జ్ఞాపకార్థం అందించిన మెమెంటోలను ఆయన అందజేశారు. బహుజన సేవా సమితి సభ్యులు అరుణకమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, దళిత చైతన్య వేదిక అధ్యక్షుడు సజ్జనరావు, నాయకులు పోపూరి సంగీతరావు, పిల్లి జయరాజు, హనుమంతరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ చలివేంద్రం ప్రారంభం



మొబైల్ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: చలివేంద్రాలతో పాదచారుల దాహార్తిని తీర్చవచ్చని శాసనసమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. శ్రీనివాస చారిటీస్ సౌజన్యంతో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ చలివేంద్రాన్ని స్థానిక రథం సెంటరులో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ సేవా సంఘం ఆధ్వర్యంలో మొబైల్ చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. విశ్వబ్రాహ్మణులకు నామినేటెడ్ పదవులు కల్పించారని తెలిపారు. గతంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్‌గా, కౌన్సిల్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా విశ్వబ్రాహ్మణులకు అవకాశం కల్పించటం జరిగిందని గుర్తు చేశారు. చేతి, కులవృత్తుల వారు తెలిపిన సమస్యలు, ఇబ్బందులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, సేవా సంఘం నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, దేవు చంద్రశేఖర్, కటకం శ్రీనివాసాచారి, బంగారు తాతారావు, శివకేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



పట్టణంలోని మూడో వార్డు పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కౌన్సిలర్

నందిగామ: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రతి గడపలోనూ మంచి ఆదరణ లభిస్తుందని పట్టణంలోని మూడో వార్డు కౌన్సిలర్ షేక్ ఖాలిక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మూడో వార్డు పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్, 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరిగింది. వార్డ్ కౌన్సిలర్, ఆ ప్రాంత నాయకులు ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్యక్రమ ప్రచారంలో భాగంగా వెళ్లిన సందర్భంలో ప్రతి గడపలోనూ మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్ల: మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఆదివారం జరిగింది. కంచికచర్ల వసంతకాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్, పలు కాలనీల్లో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. మండలంలోని పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, ఎస్ అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హెర్మోన్ మినిస్ట్రీస్ సంఘ నేత మృతి



విల్సన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల: కంచికచర్ల హెర్మోన్ మినిస్ట్రీస్ సంఘ నాయకులు, విశ్వాసి కనకపూడి విల్సన్ (51) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ విల్సన్ భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం హెర్మోన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విజయోత్సవాల కార్యక్రమాలు జరిగాయని ఆ సభల్లో తనను విల్సన్ కలిశారని పలు విషయాలపై చర్చించుకున్నామన్నారు. ఆయన మృతి హెర్మోన్ మినిస్ట్రీస్ సంస్థకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఉప సర్పంచి సురేష్, నాయకులు వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాసరావు, పాస్టర్లు పాల్గొన్నారు.

నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

పోలంపల్లి (వత్సవాయి): విద్యుత్ తీగల రాపిడివల్ల పడిన నిప్పురవ్వలకు నాలుగు ఏకరాల మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పర్చగాని వెంకటేశ్వర్లు, అలవాల బాబు చెరో రెండు ఏకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. మరో ఇరవై రోజుల్లో పంట కోయాల్సి ఉంది. పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు లూజుగా ఉండడంతో గాలికి ఒక దానికి ఒకటి తగలి నిప్పురవ్వలు చెలరేగాయి. పంట ఎండి ఉండడంతో నిప్పురవ్వలకు వెంటనే మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయం కావడం ఎవరూ వెంటనే చూడకపోవడంతో మంటలు దట్టంగా వ్యాపించాయి. మంటలు చూసిన కొందరు విషయాన్ని జగ్గయ్యపేట అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేశారు. ఎండ ఎక్కువగా ఉండడంతో మంటలు పెరిగిపోయి నాలుగు ఏకరాల పంట మొత్తం కాలిపోయింది. మొత్తం మూడు లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతులు వాపోయారు.

సీపీఎం ప్రచార భేరి

నందిగామ: పట్టణం, చందర్లపాడు మండలంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేనరి నిర్వహించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియచెప్పేందుకే కరపత్రాల ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు చనుమోలు సైదులు, కటారపు గోపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం

మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్



జై భీమ్ టీంకు నగదు బహుమతి, ట్రోఫీని అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. స్థానిక క్రిస్టియన్‌పేటలో ఇటీవల అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన జై భీమ్ క్రికెట్ టీంకు రూ.3 వేల ప్రైజ్ మనీని, ట్రోఫీని తుమ్మల ప్రభాకర్ అందజేశారు. క్రిస్టియన్ పేటలోని క్రీడాకారులకు అన్ని రకాలుగా తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం



జేవీవీ వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

తిరువూరు: క్రమం తప్పని వ్యాయామం, ఆహార నియమాలు పాటించడంతో ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని విజయవాడకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు రమేష్ సూచించారు. తిరువూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాగార్జున స్కూల్ ఆవరణలో మధుమేహరోగుల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సందర్శించిన రమేష్ మాట్లాడుతూ రక్తపోటు అధికంగా ఉండటం, మధుమేహం బారిన పడటానికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లేనని, ఉప్పు, పంచదార తగ్గిస్తే ఈ వ్యాధులు రావని సూచించారు. ఈ శిబిరంలో 1100 మంది రోగులను వైద్యులు రవీంద్ర, రాజేశ్వరి, రాఘవరావు, సత్యతేజ పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, జనవిజ్ఞాన వేదిక వలంటీర్లు వైద్యశిబిర నిర్వహణలో సహకరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ వారి ప్రదర్శనలు ప్రజలు విశేషంగా తిలకించారు. ఫైర్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక చెరుకూరివారి వీధిలో శ్రీరామ్ టవర్స్ పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివశించే ప్రజలకు నివాస గృహాల్లో జరిగే అగ్నిప్రమాదాలు, వాటిని నియంత్రించే పద్ధతులపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే ప్రతి ఒక్కరూ ఆరుబయటకు రావాలని, ప్రమాదాలు జరిగినపుడు లిఫ్టలను వాడరాదని, మెట్లమార్గాన్నే ఉపయోగించాలని తెలిపారు. ఉరుములు, మెరుపులు సంభవించినపుడు టీవీ, రిఫ్రిజిరేటర్ వంటి విద్యుత్ పరికరాలను స్విచ్ ఆఫ్ చేయడం, ప్లగ్ తీసివేయడం చేయాలన్నారు. వంటగదిలో గ్యాస్ లీకయినప్పుడు భయపడకుండా రెగ్యులేటర్‌ను ఆపివేసి గ్యాస్‌బండను బహిరంగ ప్రదేశానికి తీసుకురావాలని, ఇంటి కిటికీలు, తలుపులు తెరవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పివేసే విధానాన్ని ప్రదర్శించారు. ప్రమాదాలు సంభవించినపుడు 101, 08654-222101 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. వెల్వడం గ్రామానికి చెందిన వెల్లంకి కృష్ణకు రూ.లక్ష, గుంజి జమలయ్యకు రూ.20 వేలు చెక్కును అందజేశారు.